వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

- ఎమ్మెల్యే మందుల సామేల్
- శాలిగౌరారం పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ
- విధులకు హాజరు కాని వైద్యాధికారిపై ఆగ్రహం

శాలిగౌరారం: పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం, జూన్ 21: వైద్యులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలు సేవలు అందించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో విధులు నిర్వర్తించే మండల వైద్యాధికారి, 14 మంది సిబ్బందికి 6 గురు మాత్రమే హాజరయ్యారు. దాంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బందికి ఎమ్మెల్యే ఫోన్ చేసి ఎక్కడ ఉన్నారనే విషయంతో పాటు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. దవాఖానలో విధులు నిర్వర్తిస్తున్న స్టాఫ్‌ను మొత్తం కూడా ఇక్కడి నుంచి బదిలీ చేయాలని త్వరలో జరుగనున్న నల్లగొండ జిల్లా పరిషత్ సమావేశంలో సమావేశం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం రికార్డులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా ఎమ్మెల్యే తనిఖీ చేసి అనంతరం మధ్యాహ్నం 12.00-1.00 గంటల సమయంలో మండల వైద్యాధికారి శిల్ప విధులకు హాజరైనట్లు, ప్రజలకు ఓపీ సేవలు అందిస్తున్నట్లు ఫొటోను షేర్ చేశారు.

నర్సరీ నుంచి ఐదోతరగతి వరకు ఉచిత ఆంగ్ల విద్య

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, జూన్ 21 : ఉద్దీపన ఎడ్యూకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వీవీఎం ఉద్దీపన పాఠశాలతో నర్సరీ నుంచి 5వ తరగతి వరకు ఉచిత ఆంగ్ల విద్యను అందిస్తున్నట్లు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ పట్టణంలోని వాసవీ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాసవీ ఎడ్యూకేషన్ సొసైటీ, వాసవీ సేవాసమితికి సంబంధించిన వాసవీ కళాశాలను పేద పిల్లలకు ఉచితంగా తరగతి గదులు ఇవ్వడం సంతోషకర విషయమన్నారు. ప్రతి విద్యార్థి ప్రత్యేక సామర్థ్యాలు, స్వభావాలను గుర్తించే విధంగా విద్యాప్రణాళికలు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ వీవీఎం ఉద్దీపన పాఠశాలను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరా రు. సమావేశంలో ఉద్దీపన ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో గౌరవంగా ప్రవర్తించాలి : ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మిర్యాలగూడ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్

మిర్యాలగూడ, జూన్ 21: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పోలీసులు గౌరవంగా ప్రవర్తించాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. తిప్పర్తి, మాడ్గులపల్లి, వేములపల్లి, మిర్యాలగూడ పట్టణంలోని 1, 2 టౌన్ పోలీస్‌స్టేషన్లు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది పనితీరు, పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్థితిగతులు, పోలీస్‌స్టేషన్ రికార్డుల వివరాలను, క్రైం రేట్, శాంతి భద్రతలు, సంఘ వ్యతిరేక కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పరిస్థితులను లోతుగా అధ్యయనం చేయాలని, సమస్యలు ఉత్పన్నం కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాలు ప్రశాంతంగా ఉండేలా ప్రజలను సమాయత్తం చేయాలన్నారు. కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తిం చాలన్నారు. నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్ రాజు, ఎస్బీ సీఐ రాఘవరావు, శాలిగౌరారం సీఐ శ్రీనివాస్‌రెడ్డి, మిర్యాలగూడ సీఐలు వీరబాబు, నాగార్జున, సుధాకర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు పంట వివరాలను నమోదు చేయించుకోవాలి

- డీఏఓ శ్రవణ్ కుమార్

మాల్ : వింజమూర్‌లో ధైర్యపురి తండాల్లో రైతులతో మాట్లాడుతున్న డీఏఓ శ్రవణ్ కుమార్

మాల్, జూన్ 21 : మండలంలోని ప్రతి రైతు తమ పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని డీఏఓ పాల్వాయి శ్రవణ్ కుమార్ సూచించారు.చింతపల్లి మండలంలోని వింజమూర్ గ్రామ పంచాయతీలోని ధైర్యపురి తండాల్లో పత్తి పంటలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతి రైతు తప్పని సరిగా సర్వే నెంబర్ల వారీగా పంట నమోదును చేయించుకోవాలన్నారు. తమ పత్తి పంటల్లో 4-6 వరసలకు ఒక వరస కంది పంటను వేసుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పత్తి విత్తనాలు బలమైన వర్షాలు పడిన తర్వాతనే నాటుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు నర్సంహ, ఎస్. మధు రైతులు పాల్గొన్నారు.

చెర్వుగట్టులో దుకాణాల నిర్వహణకు వేలం

చెర్వుగట్టులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

నార్కట్‌పల్లి, జూన్ 21 : చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వ స్వామి ఆలయ పరిధిలోని వివిధ దుకాణాలు హెచ్-1, ఎల్-1 వేలం హక్కులను శుక్రవారం గుట్టపై నిర్వహించారు. 9 నెలల పాటు టెంకాయలు విక్రయించడానికి రూ.39 లక్షలకు హైదరాబాద్‌కు చెందిన అరవింద్ వేలం పాడి కైవసం చేసుకున్నారు. అలాగే గొర్రె పొటేళ్లు, మేక పోతులు సేకరించడానికి రూ.7.50 లక్షలు చెర్వుట్టుకు చెందిన లింగయ్య, కొబ్బరి చిప్పలు సేకరించే హక్కు రూ. 20.10 లక్షలకు చెర్వుగట్టుకు చెందిన శోభన్‌బాబు, కోడెలు సేకరించడానికి రూ. 5.90 లక్షలు చెర్వుట్టుకు చెందిన లింగస్వామి, గుట్టకింద అమ్మవారి ఆలయం వద్ద బొట్టు పెట్టుటకు రూ. 4.15 లక్షలు చెర్వుగట్టుకు చెందిన శోభన్‌బాబు, హోటల్ నిర్వహణ 6 నెలల పాటు రూ. 1.50 లక్షలు ఎల్లారెడ్డి గూడేనికి చెందిన విజయ్ కైవసం చేసుకున్నట్లు ఈఓ నవీన్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

INDUSIND BANK
COMMERCIAL VEHICLE FOR SALE
1.PIAGGIO APE CITY NXT+ CNG BS6 TS29TB4492
2.TATA INTRAV50 TS04UE1032
3. MAHINDRA ALFA DX PASSENGER BS6 TS05UF1190
Cell No. 7337351819
D No.797, 1st Floor, Bharath Reddy Complex, Opp: MRO Office, Main Road, Kodad-508206

PLOTS FOR SALE
AP రాజధాని అమరావతిలో CRDA అప్రూవ్డ్ వెంచర్స్ కలవు. ORR 1/2KM కంచికచర్లకి 8KM గజం కేవలం 8499/-, పూలింగ్ ఏరియాకి ఆనుకొని గజం 25999/-, Cell:9100178179, 9849561472.
NLG-

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ యూనిసెట్ కార్యాలయం, హన్మకొండ.
సర్జాపూర్ : 9182777626 | సర్జాపూర్ : 9182777635 | దేవరకొండ : 9182777635
హనుమకొండ : 9182777059 | కూకట్‌పల్లి : 9182777030 | ఉప్పల్ : 9182777038
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777030 | కాప్రా : 9182777038

ఘనంగా యోగా దినోత్సవం

- ప్రభుత్వ,ప్రైవేటు విద్యా సంస్థల ఆసనాలు వేయించిన ఉపాధ్యాయులు
- ప్రాధాన్యత వివరించిన గురువులు

రామగిరి/నీలగిరి, జూన్ 21 : అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యోగా ప్రాధాన్యతను వివరించారు. నల్లగొండలోని ఎంజీయూలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి ఆధ్వర్యంలో వర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో యోగా మాస్టర్ మాదగోని శంకరయ్య హాజరై యోగా ఆసనాలు వేయించారు. ఎంజీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్‌డీ వీసీ కొప్పుల అంజిరెడ్డి పాల్గొన్నారు. నీలగిరి జూనియర్, డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ మారం నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో యోగా చేయించారు. నల్లగొండ కత్తాల్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం తరాల పరమేశ్ యోగా విశిష్టిత తెలిపేలా పోస్టర్లు వేసి ప్రదర్శించారు. నల్లగొండ వైద్య కళాశాలలో యోగాపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.ఎన్. రాజకుమారి యోగా విశిష్టితను వివరించారు. అనంతరం విద్యార్థులకు 'యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ' అనే అంశంపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమానికి జిల్లా క్షేత్ర ప్రచార అధికారి కోటేశ్వర్ రావు అధ్యక్షత వహించగా జిల్లా యువజన అధికారి ప్రవీణ్ సింగ్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిరేకల్ : జడ్పీహెచ్ఎస్‌లో యోగా చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

వేములపల్లి : రావులపెంట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆసనాలు వేస్తున్న విద్యార్థినులు

మర్రిగూడ : కస్తూర్బాగాంధీ పాఠశాలలో యోగా చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు

శాలిగౌరారం: మోడల్‌స్కూల్‌లో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

చిట్యాల :గుండ్రాంపల్లిలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

కట్టంగూర్ : కల్మెరలో ఉపాధి హామీ కూలీలకు యోగాపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు

నల్లగొండ ఎంజీయూలో యోగా వేయిస్తున్న గురువు శంకరయ్య, ఆసనాలు వేసిన ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి, వలంటీర్లు, సిబ్బంది

నల్లగొండలో యోగా చేస్తున్న మెడికల్ కళాశాల విద్యార్థులు

యాద్గార్‌పల్లిలో రైస్ మిల్లుల తనిఖీ

రైస్ మిల్లుల్లోని రికార్డులను తనిఖీ చేస్తున్న పర్యావరణ శాస్త్రవేత్తలు

మిర్యాలగూడ, జూన్ 21: మండలంలోని యాద్గార్‌పల్లిలో రైస్ మిల్లులను పర్యావరణ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. గ్రామానికి చెందిన గువ్వల సైదులు గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన 28 రైస్ మిల్లుల వల్ల వాయు, నీటి కాలుష్యం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రైస్ మిల్లుల యాజమాన్యాలు కనీసం గ్రీనరి కూడా ఏర్పాటు చేయలేదని జాతీయ మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో కమీషన్ ఆదేశాల మేరకు పర్యావరణ శాఖ శాస్త్రవేత్తలు పురుషోత్తంరెడ్డి, రామకృష్ణ, ఇంజినీర్లు శంకర్, సజీనాబేగం పలు రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహించారు. గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన 28 రైస్ మిల్లుల్లో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులు వివరాలు తీసుకున్నారు. పూర్తి వివరాలను ఎన్‌హెచ్ఆర్‌సీకి అందించనున్నట్లు తెలిపారు. కాగా ఫిర్యాదుదారు సైదులు మాట్లాడుతూ ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా తనిఖీలకు వచ్చిన అధికారులు రైస్ మిల్లర్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందని వాపోయారు.

వర్షాలు కురవాలని బొడ్రాయికి జలాభిషేకం

బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మహిళలు

నార్కట్‌పల్లి, జూన్ 21: వర్షాలు సకాలంలో కురవాలని నార్కట్‌పల్లి పట్టణ ప్రజలు బొడ్రాయికి జలాభిషేకం చేశారు. బిందెలతో నీళ్లు పోస్తూ వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడుతున్న ప్రభుత్వం : సీపీఎం

దామరచర్ల :రాష్ట్రంలో విద్యార్థులతో ప్రభుత్వం ఆటలాడుతుందని సీపీఎం మండల కార్యదర్శి వినోద్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా ఇంతవరకు విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేయక పోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైందన్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ ఇప్పటి వరకు ఎక్కడ పూర్తిస్థాయిలో అందించలేదన్నారు. ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో లక్షల రూపాయల్లో ఫీజులు వసూలు చేస్తున్నా, నోట్‌బుక్స్, యూనిఫాం అమ్ముతున్నా అధికార్లు చోద్యం చూస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదన్నారు. విద్యారంగాన్ని పూర్తిగా నీరుకార్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు పాపానాయక్, దయానంద్, కోటిరెడ్డి, బాలసైదులు, శ్రీను, గోపి, వెంకట్‌రెడ్డి, సుభాని పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిడమనూరు, జూన్ 21: మండల పరిధిలోని ఎర్రబెల్లి 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈపాలడుగు వెంకటేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రబెల్లి సబ్ స్టేషన్‌తో పాటుగా ముప్పారం, తుమ్మడం, గుంటిపల్లి, సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలు ముప్పారం, ఊట్కూరు, నందికొండవారి గూడెం, గుంటుక గూడెం, ఎర్రబెల్లి, జూలకంటి వారిగూడెం, గుంటిపల్లి, తుమ్మడం, నారమ్మ గూడెం, వల్లభాపురం, వడ్డెరి గూడెం, రేగులగడ్డ గ్రామాలకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు పేర్కొన్నారు.

❖ త్రిపురారం : మండలంలోని కామారెడ్డి గూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని కామారెడ్డిగూడెం, గుంటిపల్లి అన్నారం, కంపాలపల్లి, కొణతాలపల్లి, బృందావనపురంతోపాటు పలు గ్రామాల్లో కూడా సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ ఎన్.రవీందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు.

❖ నకిరేకల్ : మండలంలోని మర్రూర్ స్టేషన్ పరిధిలో గల గోరెంకలపల్లి, మోదినిగూడెం, లక్ష్మీపురం, మర్రూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సాయిగణేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మర్రూర్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ జెండా ఆవిష్కరణ

నకిరేకల్, జూన్ 21 : పట్టణంలోని మూసీరోడ్డులో గల సబ్ స్టేషన్ వద్ద నకిరేకల్ సబ్ డివిజన్ ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ జెండాను ఎమ్మెల్యే వీరేశం ఆవిష్కరించారు. అనంతరం అనూష గార్డెన్స్ లో నిర్వహించిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్, ఎం.సురేశ్‌కుమార్, అమర్‌కుమార్‌రెడ్డి, రవికుమార్,హరిప్రసాద్, ఎమ్‌డి అబ్బాస్ అలీ, పాల్గొన్నారు.

20 ఏండ్లుగా యోగాలో ఉచిత శిక్షణ

యోగా చేస్తున్న గురువు కొత్త రఘువీర్

రామగిరి, జూన్ 21: నల్లగొండ పట్టణానికి చెందిన కొత్త రఘువీర్ 20 యేండ్లుగా ఉచితంగా వందలాది మందికి యోగ విద్య అందిస్తున్నారు. జ్ఞాన యోగా పీఠం అనే యూ ట్యూబ్ చానెల్ ద్వారా నిత్యం యోగాతోపాటు ఆధ్యాత్మిక విషయాలను పంచు కుంటున్నారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ నిత్య యోగా సాధనతో ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని వెల్లడిస్తున్నారు యోగా గురువు రఘువీర్

నిబంధనల మేరకే ఇసుకను తరలించాలి

నల్లగొండ ఆర్డీఓ రవి

శాలిగౌరారం, జూన్ 21 : ప్రభుత్వ నిబంధనల మేరకే ఇసుకను తరలించాలని నల్లగొండ ఆర్డీఓ రవి, డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. మండలంలోని వంగమర్తి గ్రామ ఇసుక రీచ్‌ని శుక్రవారం వారు పరిశీలించారు. రీచ్ ప్రాంతంలో ఉన్న లారీలు, జేసీబీ, వేబ్రిడ్జిల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఇసుక తరలింపు విధానాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవన్నారు. రీచ్‌ల వద్ద లారీల సంఖ్య ఇంత ఎక్కువ ఎందుకుందని ప్రశ్నించారు. ఆన్‌లైన్‌లో జాప్యం అవుతున్నదున లారీలు నిల్వ ఉంటున్నాయని సిబ్బంది సమాధానం ఇచ్చారు. ఇక్కడ ఉన్న లారీలు వెళ్లేంత వరకు ఇసుక తరలింపును నిలుపుదల చేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. సీఐ శ్రీనివాస్‌రెడ్డి, తాసీల్దార్ అన్వర్‌హుస్సేన్, ఆర్ఐ నవీన్‌కుమార్ ఉన్నారు.

ధరణి పురోగతి పరిశీలన

అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

తిరుమలగిరి(సాగర్), జూన్ 21: ప్రభుత్వం ధరణిలో సమస్యలను సరిచేస్తున్న నేపథ్యంలో పనుల పురోగతిపై ఆర్డీఓ శ్రీనివాస్‌రావు మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించి పరిశీలించారు. అనంతరం ఇన్‌చార్జి తాసీల్దార్ జంగాల కృష్ణయ్యను పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ధరణి సమస్యలను త్వరగా పూర్తి చేసి రైతులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కాగా కొందరు రైతులు తమ సమస్యలను ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు.ఆయన స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టీబీతో అప్రమత్తంగా ఉండాలి

చందంపేట, జూన్ 21: గ్రామీణ ప్రజలు టీ.బీ.పై అప్రమత్తంగా ఉండాలని టీబీ నోడల్ పర్సన్ అధికారి పులికంటి భాస్కర్ సూచించారు. మండలంలోని రేకులగడ్డ, యాపలపాయతండాల్లో నిర్వహించిన ఏసీఎఫ్ క్యాంప్‌లో భాగంగా టీ.బీ.పై ప్రజలకు అవగాహన కల్పించారు. టీ.బీ సోకితే అధైర్యపడొద్దని, స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బావోజీల కొత్త కార్యవర్గం

నూతనంగా ఎన్నికైన బావోజీ కమిటి సభ్యులు

చందంపేట, జూన్ 21 : దేవరకొండ నియోజకవర్గంలో ఉన్న బావోజీ(పూజారులు)ల కొత్త కార్యవర్గాన్ని సేవాలాల్ మహారాజ్ ఆలయం లో శుక్రవార ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఇస్లావత్ సక్రు స్వామి, ఉపాధ్యక్షుడిగా నేనావత్ దేవుడు స్వామి, కార్యదర్శిగా సీతారాంస్వామి, సహాయ కార్యదర్శిగా హతీరాంస్వామి, ప్రధానకార్యదర్శిగా చంద్రబాబుస్వామి, సభ్యులు గా రవి, అంజి, దస్రూ, గన్య, బాబులాల్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ బావోజిలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని అన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల తనిఖీ

మాల్, జూన్ 21 : చింతపల్లి మండలంలోని గొడకొండ్లలోని అమ్మ ఆదర్శ పాఠశాలను ఎంపీడీఓ సుజాత శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం మొక్కలను నాటారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి యోగా చేయించారు. కార్యక్రమంలో తాసీల్దార్ విజయకుమార్, ఎంపీడీఓ సుజాత అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిని విస్తృతంగా ప్రచారం చేయాలి

- మిర్యాలగూడ మండల ప్రత్యేక అధికారి డాక్టర్ వెంకట్‌రెడ్డి

మిర్యాలగూడ : మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి

మిర్యాలగూడ, జూన్ 21: మండల కేంద్రాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిపై విస్తృతంగా ప్రచారం చేయాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ శేషగిరిశర్మ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇక నుంచి ప్రతి సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజావాణి నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజల తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సకాలంలో ఎంపీడీవో కార్యాలయానికి రావాలని వారు ఆదేశించారు.

వేములపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణిపై అవగాహన కల్పించడానికి మండల ప్రత్యేకాధికారి మక్బుల్‌అలీ, ఎంపీడీఓ శారదాదేవి మండల అధికారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. అధికారులు ప్రజవాణి కార్యక్రమానికి సకాలంలో హాజరై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి పరిష్కరించాలన్నారు.

త్రిపురారం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని అధికారులకు ప్రజావాణిపై ఎంపీడీఓ విజయకుమారి శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాల్ : చింతపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణిలో అధికారులందరూ పాల్గొనాలని మండల ప్రత్యేక అధికారి సక్కుబాయి కోరారు. మండలంలోని అధికారులకు ప్రజావాణిపై అవగాహన కల్పించడానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజావాణి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసే విధానాన్ని వివరించారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

చందంపేట, జూన్ 21 : ఈనెల 24 నుంచి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా వాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మి కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలు తమ సమస్యలు మండల కేంద్రంలో నేరుగా ప్రజావాణి ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని సూచించారు.